క్లుప్తంగా

పంట పొలాల్లో పశువులు మేస్తే పరిహారం

రైతు సంఘం నిర్ణయం

ధారూరు: వ్యవసాయ పంట పొలాల్లో పశువులు మేస్తే బాధ్యులపై జరిమాన విధించాలని ధారూరు రైతు సంఘం నిర్ణయించింది. మంగళవారం రైతు సంఘం నాయకులు, రైతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు ఒప్పంద పత్రం రాసుకుని తీర్మాణం చేశారు. గ్రామ పరిధిలోని పొలాల్లో సాగు చేసిన పంటలను పశువులు, మేకలు మేసి నష్టం చేస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పశుకాపరులు ఈ విషయంలో జాగ్రత్త వహించాలని వారు సూచించారు. అనంతరం పొలాల్లో పశువులు మేస్తే ఒక్కో పశువుకు రూ.10వేలు, మేకలు మేస్తే రూ.5 వేలు జరిమాన వసూలు చేయనున్నట్లు రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు.

ఏడీఏ రుద్రమూర్తి బదిలీ

పదోన్నతిపై కుమురం భీం ఆసీఫాబాద్‌కు డీడీఏగా పోస్టింగ్



తాండూరు రూరల్: వ్యవసాయశాఖ తాండూరు ఏడీఏ రుద్రమూర్తి బదిలీ అయ్యారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ (డీడీఏ)గా పదోన్నతి కల్పిస్తూ వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి ఆయనకు ఉత్తర్వులు అందాయి. 2022 లో తాండూరులో ఏడీఏగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిత్యం రైతులకు అందుబాటులో ఉండి వారి మన్ననలు పొందారు. పదోన్నతి లభించడంతో రుద్రమూర్తి కుమురంభీం ఆసీఫాబాద్ కలెక్టరేట్‌లో డీడీగా బాధ్య తలు చేపట్టనున్నారు. బుధవారం ఆయన రిలీవ్ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఓటరు లిస్టులో తప్పలను సరిచేయించుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్: ఓటరు లిస్టులో ఏమైనా తప్పులు ఉంటే సరిచేయించుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అఖిల పక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు లిస్టులో మార్పులు చేర్పులకు అవకాశం ఉందన్నారు. గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. ప్రతి పార్టీ నుంచి బూత్‌లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. పోలింగ్ బూత్‌ల వారీగా బీఎల్‌ఏలు తగిన వివరాలు సేకరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో అఖిల పక్ష నాయకులు రమేశ్‌బాబు, కృష్ణయాదవ్, ఆసీఫ్ ఖాన్, తలారి శేఖర్, సిరుసని శ్యాంసుందర్, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్యం అందక పాడి గేదె మృతి

పూడూరు: సకాలంలో వైద్యం అందక తన పాడి గేదె మృతిచెందిందని చీలాపూర్‌కు చెందిన బాధిత రైతు కుర్వ సత్యం వాపోయారు. తన పాడి గేదె పరిస్థితి బాగోలేకపోవడంతో వెటర్నరీ సిబ్బందికి సమాచారం అందించానని తెలిపాడు. సరైన వైద్యం అందకపోవడంతో తీవ్ర రక్తస్రావమై గేదె మృతిచెందిందని, దీంతో తనకు రూ.1.20 లక్షల నష్టం వాటిల్లిందన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని అభ్యర్థించాడు.

పేదలకే ఇందిరమ్మ ఇళ్లు

మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉదయ్ భాస్కర్‌రెడ్డి



గోనూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న నాయకులు

తాండూరు రూరల్: గ్రామాల్లోని నిరు పేదలకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తాండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉదయ్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గోనూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్‌భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో గోనూర్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డి, వెంకటయ్య, ఖాసీం, ఆనంద్, వెంకట్, రాఘవేందర్‌రెడ్డి, హరినాథ్ రెడ్డి, తుకారం, మాణిక్యం, శ్రీకాంత్, అరవింద్, నర్సింలు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న అధికారులు



మల్లేపల్లిలో టమాట సాగు చేసిన రైతు

ప్లాస్టిక్ మల్చింగ్ భేష్!

- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి
- చీడపీడల నుంచి రక్షణ
- ఆధునిక సాగుపై ఆసక్తి చూపిస్తున్న రైతులు

దోమ: సాగు చేసే పంటలపై అతివృష్టి, అనావృష్టి, పరిస్థితుల ప్రభావం ఎంతో కొంత చూపిస్తున్నాయి. దీనికి తోడు దిగుబడులు రాక పెట్టుబడులు చేతికందక తీవ్రంగా రైతులు నష్టపోతున్నారు. ఈ క్రమంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందేందుకు అడుగులు వేస్తున్నారు. నీటి వనరులు తక్కువ ఉన్నచోట తోటలు, కూరగాయల సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. అయితే వీటిని సాగు చేసే సమయంలో భూమిలో తగినంత తేమ ఉండేలా చూసుకోవలసి ఉంటుంది. ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో ఒకటైన ప్లాస్టిక్ మల్చింగ్ విధానంతో నేలలోని తేమను కాపాడుకోవడంతో పాటు నీటిని కూడా ఆదా చేసుకోవచ్చు. ఈ విధానం రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని ఉద్యా న, పట్టుపరిశ్రమ అధికారులు చెబుతున్నారు.

సమగ్ర కలుపు నివారణ

సూర్యరశ్మి నేరుగా కలుపు మొక్కలకు సోకకుండా చేయడంతో కిరణజన్య సంయోగ క్రియతో సుమారు 85శాతం వరకు సమగ్ర కలుపు నివారణతో పాటు పర్యావరణ సంరక్షణకు తోడ్పడుతుంది.

నీటి ఆదా

మొక్క చుట్టూ భూమిలో ఉండే తేమను ఆవిరి కాకుండా నివారించడంతో వివిధ కాల పరిమితులు గల పంటలకు 30నుంచి 40 శాతం వరకు నీటి ఆదా అవుతుంది. దీనిని బిందూ సేద్య పద్ధతిలో కలిపి వాడితే అదనంగా 20 శాతం నీరు ఆదా అవుతుంది. తద్వారా పంటలకు 2నుంచి 3 నీటి తడులు ఆదా చేసుకోవచ్చు.

భూసారం తయారీకి..

నీరు పారించడం లేదా వర్షపు నీరు నేరుగా భూమిపైన పడకుండా నివారించడంతో నేల కోతను నివారించి పైపొరల్లో భూసారాన్ని కాపాడుకోవచ్చు. అదే కాకుండా మల్చింగ్ షీటు వేసిన తర్వాత భూమి పైపొరల్లో నేల గుల్లబారి వేరు వ్యవస్థ బాగా వృద్ధి చెందుతుంది. దీంతో నీరు, ఎరువులు భూమి లోపల పొరల్లో నుంచి కూడా మొక్కలకు చేరుతుంది. దీంతో పంట కాలం తర్వాత నేల తయారీకి అయ్యే ఖర్చు ఆదా అవుతుంది.

నేల ఉష్ణోగ్రత నియంత్రణ

మొక్క చుట్టూ సూక్ష్మ వాతావరణ పరిస్థితులను కలుగజేస్తు నేల ఉష్ణోగ్రతను నియంత్రిస్తుంది. తద్వారా నేలలో ఉండే సూక్ష్మజీవుల చర్య అధికమై నేల స్వభావాన్ని మెరుగు పరుస్తూ పోషక పదార్థాలను అందేలా చేస్తుంది. దీని ద్వారా భూమిలోని క్రిములు, తెగుళ్లు కలుగ జేయు శిలీంద్రాలు నివారించబడతాయి.

వైరస్ తెగుళ్ల వ్యాప్తికి దోహదం

మల్చింగ్ షీటుపైన పడిన సూర్యరశ్మి పరివర్తనం చెంది మొక్కల లోపలి అంచు భాగాలకు తగలడంతో ఆకుల అడుగున ఉండే రసం పీల్చే పురుగులు రాలి కింద పడిపోతాయి. దీని ద్వారా వైరస్, తెగుళ్ల వ్యాప్తి తగ్గి సస్యరక్షణకు అయ్యే ఖర్చు కొంత మేర మిగులుతుంది.

అధిక దిగుబడులు..

పంట కాలం, అనుకూల సూక్ష్మ వాతావరణ పరిస్థితులు చోటుచేసుకోవడంతో పంట ఏపుగా పెరిగి మంచి నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు 20 నుంచి50 శాతం వరకు పొందొచ్చు.

యాంకరింగ్ ప్రక్రియ..

మల్చింగ్‌ను రెండు రకాలు వేసుకోవచ్చు.

1) విత్తనాలు విత్తుటకు ముందు,

2) నాటిన మొక్కలకు తర్వాత కూడా వేసుకోవచ్చు. మొక్కలకు ఇరువైపులా లేదా చుట్టూ 5సెం.మీ నుంచి 10 సెం.మీ. లోతు గాడి చేయాలి. మల్చింగ్ షీట్‌ను కావాల్సిన సైజులో కత్తిరించుకోవాలి. ఈ షీటును ప్రతీ వరుసలో లేదా చెట్టు దగ్గర మరీ వదులుగా లేదా బిగుతుగా లేకుండా కప్పి అన్ని చివరలకు గాడిలో పోయేలా చేసి మట్టితో కప్పాలి. ఈ ప్రక్రియనే యాంకరింగ్ అంటారు. దీని వలన మల్చింగ్ షీటు గాలికి చెదిరిపోకుండా ఉంటుంది.

సాయంత్రం వేళలో..

మల్చింగ్ షీటును బలంగా లాగకూడదు. సాయంత్రం వేళలో మాత్రమే షీట్లను అమర్చాలి. ఎందుకంటే దీనికి సాగే గుణం ఉంటుంది. ఎక్కువ గాలి ఉన్నప్పుడు కూడా మల్చింగ్ వేయరాదు. పంట కాలం తర్వాత మల్చింగ్ షీటును పొలం నుంచి తీసివేసి పనులు చేసుకోవాలి. 7.5 మైక్రాన్ల మందం కలిగిన షీట్లు ఒక పంట కాలానికి, 50నుంచి 200 మైక్రాన్ల మందం కలిగిన షీట్లు మూడు సంవత్సరాల వరకు మన్నిక కలిగి ఉంటాయి.

తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో..



తమకున్న వ్యవసాయ పొలాల్లో ఈ విధానంతోనే కూరగాయలు, పూవ్వులు, పండ్ల తోటలను సాగు చేసుకోవచ్చు. ఈ విధానం ద్వారా కలుపు తక్కువగా ఉంటుంది. ఎరువుల వాడకం కూడా తగ్గుతుంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగుకు అవకాశం ఉంటుంది. దీంతో దిగుబడి పొందే వీలు కలుగుతుంది. ప్రభుత్వం మల్చింగ్ షీట్‌కు రాయితీ అందజేస్తుంది.

– నెత్తి అంజిలయ్య, రైతు, మల్లేపల్లి

దరఖాస్తు చేసుకోవాలి



మల్చింగ్ విధానం రైతులు ఏర్పాటు చేసుకోవాలంటే ఉద్యాన వన, పట్టుపరిశ్రమ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవాలి. ఎకరానికి రూ.6 వేల రాయితీని ప్రభుత్వం అందిస్తుంది. ఈ ఏడాదిలో జిల్లాలో 1,300 ఎకరాల వరకు రైతులు మల్చింగ్ వేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. అర్హులైన రైతులు తమ తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లతో అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి.

– సత్తార్, జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ అధికారి

ఘనంగా బోనాలు



పూడూరులో పోతరాజుల విన్యాసాలు, బోనాలతో తరలుతున్న మహిళలు

పూడూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆషాడమాస బోనాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పూడూరు మండల కేంద్రంలో భక్తులు బోనాలతో గ్రామాల్లోని వీధుల గుండా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆయా గ్రామాల్లో పోతరాజుల విన్యాసాలు ఆకర్షణగా నిలిచాయి. అనంతరం శివసత్తులు భవిష్యవాణిని వినిపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, మల్లేశం, అజయ్, అనంతరాములు, సుబాన్, బుచ్చన్న, శ్రీశైలం, పాండు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పర్సాపూర్‌లో..

కొడంగల్: మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనం ఎత్తుకొని వెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: మండల కేంద్రంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు బోనాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తరలి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

సంస్కృతి, సంప్రదాయం తెలియాలి

బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సౌమ్యారెడ్డి

కుల్కచర్ల: సంస్కృతి, సంప్రదాయాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సౌమ్యారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో ఆషాడ బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో బోనాలు, పోతురాజుల విన్యాసాల నడుమ పోచమ్మ ఆలయానికి తీసుకువెళ్లి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో పాశ్చత్య సంస్కృతిని అవలంభిస్తూ ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆషాడం పురస్కరించుకుని చిన్నారులకు గోరింటాకు పెట్టారు. ఈ కార్యక్రమంలో విజయకుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ అర్చన, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు తపస్‌లో చేరండి



ఉపాధ్యాయులకు సభ్యత్వం కల్పిస్తున్న తపస్ ఉపాధ్యాయ సంఘం సభ్యులు

తాండూరు రూరల్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్)లో చేరాలని ఆ సంఘం నియోజకవర్గ కన్వీనర్ శ్రీశైలం పేర్కొన్నారు. మంగళవారం తాండూరు మండలంలోని ఆయా పాఠశాలలో తపస్ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ..ఉపాధ్యాయ సమస్యలపై తపస్ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేస్తున్నామన్నారు. ఉద్యోగుల సరెండర్, డీఏ బకాయి బిల్లులను చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆనంద్, తాండూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు సుంకరి రవి, వినోద్, జిల్లా ఉపాధ్యక్షుడు వడిచర్ల సత్యం, మాణిక్‌రావు, కృష్ణకుమార్, బుగ్గప్ప తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయం అభినందనీయం

మండల విద్యాధికారి గోపాల్



క్రీడా సామాగ్రి అందజేస్తున్న దాతలు

పరిగి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు చేస్తున్న సాయం అభినందనీయమని మండల విద్యాధికారి గోపాల్ పేర్కొన్నారు. సౌదీ అరేబియాలోని ఖ్వాస్సిమ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి, సురేశ్ దంపతులు మంగళవారం పట్టణ కేంద్రంలోని జిల్లాపరిషత్ నంబర్ 1 ఉన్నత పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు కష్టపడి ఇష్టంతో చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా చైర్మన్ ముకుందనాగేశ్వర్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

❖ స్పీకర్ సమీక్షా సమావేశం రద్దు

ధారూరు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో నిర్వహించాల్సిన సమీక్షా సమావేశం రద్దయిందని ఎంపీడీఓ నర్సింహులు పేర్కొన్నారు. ఆరుబయట వేసిన టెంట్లు వర్షం వల్ల తడిసిపోయాయని, ఇతర అనివార్య కారణాల వల్ల కూడా ఈ సమావేశాన్ని రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. ఈ సమావేశాన్ని తిరిగి ఎప్పుడు నిర్ణయించేది త్వరలో ప్రకటిస్తామని ఆయన వివరించారు.

❖ నేడు ఎమ్మెల్యే రాక

బషీరాబాద్: ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి బుధవారం ఎక్మాయి గ్రామంలో పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు మల్కన్‌గిరి గ్రామంలో మొక్కలు నాటి నేరుగా ఎక్మాయి గ్రామానికి రానున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసిన అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు స్థానిక కాంగ్రెస్ నేతలు డబ్బులు వసూలు చేశారని సాక్షిలో గత నెలలో కథ నం ప్రచురించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తారని మండల నాయకుడొకరు తెలిపారు.

❖ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, విద్యుత్‌వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే క్రమంలో బుధవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు, రైతులు ఈ విషయాన్ని గ్రహించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

❖ బోనాలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

తాండూరు: తాండూరు కాళికాదేవి ఆలయ బోనాల జాతరకు రావాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని ఆలయ కమిటీ చైర్మన్ పి. బస్వరాజ్, కమిటీ ప్రతినిధులు ఆహ్వాన పత్రిక అందజేశారు. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. ఈ నెల 20వ తేదీ నుంచి 21వరకు నిర్వహించనున్న జాతరకు హాజరుకావాలని కోరారు.

❖ విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలి

బొంరాస్‌పేట: దోమల వల్ల సోకే వ్యాధులపై విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని ఫైలేరియా, మలేరియా సబ్ యూనిట్ అధికారి పకీరప్ప సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బొట్లోని తండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో దోమల నివారణకు పిచికారీ చేయించారు. అనంతరం విద్యార్థులకు దోమల వల్ల సంభవించే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విక్రమ్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి శివలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు మూసివేయాలి

- మద్యం నిషేధించాలని సంతకాల సేకరణ
- జీపీ కార్యదర్శికి అందజేత



నాగారంలో మద్యం నిషేధించాలని కోరుతూ ఓ కిరాణ షాపులో అవగాహన కల్పిస్తున్న యువత

ధారూరు: మండలంలోని నాగారం గ్రామంలో విచ్చలవిడిగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను మూసివేయాలని మంగళవారం యువత, మహిళలు, రైతులు, వ్యాపారులు తీర్మాణించుకున్నారు. ముందుగా యువకులు ప్రతీ ఇంటికి వెళ్లి గ్రామంలో మద్యం అమ్మొద్దని..తాగొద్దని అవగాహన కల్పించి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సంతకాలతో కూడిన జాబితాను గ్రామ కార్యదర్శికి అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామంలో దాదాపు 20 బెల్ట్‌షాపుల ద్వారా నిత్యం మద్యం విక్రయిస్తున్నారని, దీనికి బానిసలైన పేదలు ముఖ్యంగా యువత ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటూ ధనాన్ని దుబార చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా మద్యం దొరకడంతో కొందరు అదే పనిగా మద్యం సేవిస్తూ అనారోగ్యం బారిన పడి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ఇక్కడ మద్యం అమ్మకాల వల్ల సుమారు రోజుకు రూ. లక్ష వరకు ఆదాయం సమకూరుతుందని చెబుతున్నారు. ఇప్పటికే కొన్ని కుటుంబాలు చిద్రమైపోయాయని, తాగుడుకు బానిసై అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ విషయంలోతగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు జీపీ కార్యదర్శికి దృష్టికి తీసుకొచ్చారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు

కుల్కచర్ల: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఎల్పాటి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం చౌడాపూర్ మండల కేంద్రంలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల కలలను సాకారం చెయ్యడంలో కాంగ్రెస్ ముందుంటుందన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలన్న ఉద్దేశంతోనే ప్రతీ గ్రామంలో నూతన గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రానున్న స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.

నూతన కమిటీ..

గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కావలి గోపాల్, ప్రధాన కార్యదర్శిగా దాసరి నర్సింలు, ఉపాధ్యక్షుడిగా రాములు, యాదయ్య, కార్యదర్శిగా నర్సింలు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షుడు రాము, మండల ఉపాధ్యక్షుడు నరసింహ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య, సలీం, పాల్గొన్నారు.



నూతన కమిటీతో మండల నాయకులు

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి



వెంకటయ్యను సన్మానిస్తున్న విజయ్‌కుమార్‌రెడ్డి

దోమ: కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దోమ మండల పరిధిలోని రాకొండా కాంగ్రెస్ నూతన కమిటీని ఆయన ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా మజ్జిగా వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా బండి వెంకటయ్య, ఖాజామైనొద్దీన్, ప్రధానకార్యదర్శి చాపల శ్రీనివాస్, కోశాధికారిగా చంద్రయ్య, సోషల్ మీడియా కన్వీనర్‌గా వడ్ల సురేందర్, సమన్వయకర్తగా మురళీకృష్ణ, సభ్యులుగా పలువురు నేతలను ఆయన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడిని ఆయన శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతీకార్యకర్త ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పేదలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వంట గ్యాస్ వినియోగంపై జాగ్రత్తలు తప్పనిసరి

ఏజెన్సీ డీలర్ విష్ణువర్ధన్‌రెడ్డి



హెచ్‌పీ గ్యాస్ గోదాన్ ఎదుట మొక్క నాటి నీరు పోస్తున్న డీలర్ విష్ణువర్ధన్‌రెడ్డి

దోమ: వంట గ్యాస్ వినియోగంపై జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని దోమ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ డీలర్ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దోమ మండల కేంద్రంలో హెచ్‌పీ గ్యాస్ 51వ వారోత్సవాల్లో భాగంగా గోడౌన్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలు వంట గ్యాస్ వినియోగిస్తున్నప్పుడు వంటగదిలో తగినంత గాలి, వెలుతురు వచ్చేలా కిటికీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్యాస్ స్టౌ ఎదురుగా కిటికీ ఉండకుండా చూసుకోవాలి. వంట గదిలో సిలిండర్ మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలి. కిరోసిన్, డీజిల్, పెట్రోల్ ఇతర మండే పదార్థాలను నిల్వ ఉంచొద్దన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సిలిండర్‌ను తొలగించడానికి వీలైనంత స్థలముండేలా చూసుకోవాలి. గ్యాస్ సిలిండర్‌ను ఇతరులకు ఇవ్వొద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీ గ్యాస్ సిబ్బంది సత్తయ్య, శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

తల్లీబిడ్డా క్షేమం



అంబులెన్స్‌లో పుట్టిన బిడ్డను వారి బంధువులకు అప్పగిస్తున్న సిబ్బంది

బషీరాబాద్: పురిటి నొప్పులతో అంబులెన్స్‌లో ఆస్పత్రికి బయలు దేరిన గర్భిణి మార్గమధ్యలోనే ప్రసవించింది. ఈ ఘటన బషీరాబాద్ మండలం దామర్‌చెడ్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన అంబిక రెండో కాన్పుకోసం అంబులెన్స్‌లో తాండూరు జిల్లా ఆస్పత్రికి బయలుదేరింది. అయితే కాశీంపూర్ సమీపంలోకి రాగానే నొప్పులు తీవ్రమయ్యాయి. కొద్దిసేపటికే పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అంబులెన్స్ సిబ్బంది ప్రకాశ్, ఎండి నసిరుద్దీన్ ఆమెకు సపర్యలు చేశారు. అనంతరం వారిని తాండూరు మాతాశిశు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లీబిడ్డా ఆరోగ్యంగానే ఉన్నారని వైద్యులు తెలిపారు.

సబ్‌స్టేషన్ మంజూరు చేయండి

దోమ: ఐనాపూర్ గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని జిల్లా విద్యుత్ కార్యాలయంలో ఎస్ఈ రవిప్రసాద్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దిర్సంపల్లి సబ్‌స్టేషన్ నుంచి తమ గ్రామానికి కొన్ని సంవత్సరాలుగా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. గృహవినియోగదారులు, వ్యవసాయ దారుల కనెక్షన్లు పెరగడంతో ఓవర్ లోడ్ సమస్య ఏర్పడి తరచూ అంతరాయం కల్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి తమ గ్రామానికి నూతన సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మానస

మర్పల్లి: ప్రతిఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను తప్పనిసరిగా పాటించాలని పట్లూర్ పీహెచ్‌సీ డాక్టర్ మానస విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో వైద్య సిబ్బందితో కలిసి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థినీ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. భోజనం చేసేముందు సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ సూపర్ వైజర్ అమరేశ్వరి, ఎస్ఓ సునిత పాల్గొన్నారు.